# మొదలి నాటక రచనా ప్రస్థానం

- డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు

ఆచార్య మొదలి నాగభూషణశర్మ సమగ్ర నాటక ప్రతిభా సుసంపన్నుడు. నాటకం చేత ... నాటకం వలన ... నాటకం కొరకు తన ప్రతిక్షణాన్ని అంకితం చేసిన నిత్యసత్య నాటక కృషీవలుడు. పాశ్చాత్య నాటక సర్వస్వాన్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకొన్న పండితశేఖరుడు. నాటకరచనతోపాటు దర్శకునిగా, ఆచార్యునిగా... పరిశోధకునిగా... అనువాదకునిగా సంపూర్ణసిద్ధిని పొందిన నటకావతంసుడు. అనంతమైన నాటక సాహిత్య నిధిని నిక్షిప్తం చేసిన వరేణ్యుడు. మొదలి నాటకరచయితగా గొప్పవాడా? దర్శకునిగా గొప్పవాడా? ఆచార్యునిగా గొప్పవాడా? పరిశోధకునిగా గొప్పవాడా? అని బేరీజు వేస్తే అంచనావేయడం కష్టసాధ్యం. ఒకదానితో ఒకటి తీవ్రమైన పోటీపడతాయి. ఆయనే ఒక నాటక విశ్వవిద్యాలయం. నాటకం అంటే మొదలి... మొదలి అంటే నాటకం. నాటకమే ఆయన తపస్సు... ఉషస్సు...ఓజస్సు.

మొదలివారి నాటకప్రస్థానంలో తొలిఅడుగు రచన. స్వతంత్రనాటకాలు వ్రాశారు, అనువాదాలను చేశారు. ఇతివృత్త స్వీకారంలో ఉపరిస్పర్శలూ, విహంగవీక్షణాలు ఉండవు. అసమగ్రత అణుమాత్రం ఉండదు. ప్రతి అంశాన్నీ-ప్రతి వస్తువునూ సునిశిత అనుశీలన, అన్వయనం చేసి సుస్పష్టత వచ్చాక రచనా అల్లికను మొదలు పెడతారు. ప్రతి ఇతివృత్తం గిజిగాడి గూడుగా చిక్కగా, చక్కగా ఉంటుంది. చర్విత చరణం వెదికినా కన్పించదు.

ప్రతి ఇతివృత్తంలోనూ నవ్యతకోసం ఆరాటపడతారు. పాతకథనైనా కొత్తగా చెబుతారు. విషయాన్ని వంకర టింకరగా కాకుండా సూటిగా... ఘాటుగా... సరళంగా ప్రేక్షకుడి మస్తిష్కంలో బలంగా ముద్రిస్తారు. స్వతంత్రమైనా... అనువాదమైనా ఇది మన కథ. మన వ్యథ అనే భావనను సుస్థిరం చేస్తారు. అందుకే మొదలివారి నాటకాలు కాలానికి నిలిచే చిరంజీవులు.

మొదలి వారి తండ్రి శ్రీమాన్ సుబ్రహ్మణ్యశర్మ. వారు ఉపాధ్యాయులే కాదు... మంచి నటులు... రచయిత. మొదలివారికి అక్షరాభ్యాసం చేసిందీ... అభినయానికి అంకురార్పణ చేసిందీ తండ్రిగారే. ప్రతి పనినీ మనసుపెట్టి చేయాలనే తండ్రిగారి తొలిపాఠం మొదలివారికి తారకమంత్రంగా నిలిచింది. పాఠశాల విద్యార్థిగా రంగప్రవేశం చేసిన రెండుపదుల వయస్సులో నాటక రచనకు శ్రీకారం చుట్టారు. 1954 నుండి 63 వరకూ నాగభూషణ్ పేరుతో ఎనిమిది నాటికలను వ్రాశారు. నాటక రచన తొలిదశలో బుడిబుడి అడుగుల అపసవ్యాన్ని చక్కదిద్దిన గురుపాదులు కొప్పరపు సుబ్బారావు. రచనాప్రతిని తీసుకొని పేజీలో ఎడమవైపు ఖాళీభాగంలో కొప్పరపు పెట్టిన ప్రశ్నార్థకగుర్తులే లోపాముద్రలు. పేజీలోని ప్రశ్నార్థకం గుర్తును చూసి తలెత్తి వారివంక చూస్తే వెన్నపూసంత మృదువుగా లోపాన్ని చెప్పేవారు. కొప్పరపువారి ఆ తొలిపాఠాలే మొదలివారికి పెద్దబాలశిక్ష లయ్యాయి. అందుకే కృతజ్ఞతాపూర్వకంగా తొలి నాటికరచనలసంపుటిని కొప్పరపు సుబ్బారావుకు అంకితమిచ్చారు. మొదలివారి తొలిరచన అన్వేషణ (1954). అనంతరం చిన్నలు పెద్దలు (1955), వీలునామా (1955), రాజదండం (1956), కల-కాపురం (1956), సంస్కర్తలు (1956), అడ్డదారి (1958), జననీ జన్మభూమి (1963), అతిథి దేవోభవ (1958) తొలిదశలో రచించారు.

మొదలి నాటకరచనలను మూడురకాలుగా వర్గీకరించవచ్చు. స్వతంత్ర రచనలు; విదేశీ అనువాదాలు; దేశీయ అనువాదాలు.

విషాదాంతం; జంటపక్షులు; రేపటి స్వర్గం; మరణ గీతం; పుడమి తల్లీ నీకు జోహారు; సందిగ్ధ సమరం; మన్మథుడు మళ్లీపుట్టాడు; ప్రజానాయకుడు ప్రకాశం; మదనకామరాజు కథ; పెళ్లికి పదినిముషాలముందు; వంటి స్వతంత్ర నాటకాలను రచించారు.

దేశీయ నాటక అనువాదాలలో మృచ్ఛకటికం (శూద్రకుడు), ముద్రారాక్షసం (విశాఖదత్తుడు), ప్రతిమా నాటకం (భాసుడు), భగవదజ్జుకం నాటకాలను ఆంధ్రీకరించారు. బలిదానం (ఠాగూర్); ఎర్రగన్నేరు (ఠాగూర్); కబీరు పిలుస్తున్నాడు వినండి (కబీరఖడా బజార్ మి; హిందీ భీష్మ సహానీ); హయవదన (గిరీష్ కర్నాడ్ : కన్నడ); సాంబశివ ప్రహసనం (కన్నడ : చంద్రశేఖర కంబార్); నిశ్శబ్దం కోర్టు నడుస్తుంది (సైలెన్స్ ది కోర్ట్ ఈజ్ ఇన్ .... (మరాఠీ : విజయ్ టెండూల్కర్); అంధయుగం (అంధాయుగ్ : హిందీ : ధర్మవీర్ భారతి); కాయితం పులి (శంకర్ శేష్ : హిందీ : పోష్టర్) ఉన్నాయి. పాశ్చాత్య నాటకాలలో యాంటిగని (సోఫోక్లిస్ - గ్రీకు); మేక్‌బెత్ (షేక్స్పియర్ - ఇంగ్లీష్); ఈడిపస్ (సోఫోక్లిస్ : గ్రీకు); పిసినిగొట్టు (ది మైజర్ మోలియర్); బొమ్మరిల్లు (ఎడాల్స్ హౌస్, ఇబ్సన్); ప్రజలమనిషి (యాన్ ఎనిమీ ఆఫ్ ది పీపుల్ : ఇబ్సన్); దొరా నీ సావు మూడింది (ఎంపరర్ జోన్స్ యూజిన్ ఓనీల్); రేపటి స్వర్గం (ది మడ్ ఉమెన్ ఆఫ్ చాలియట్ : జీన్); దేవుడయ్యా వొస్తాడంట (వెయిటింగ్ ఫర్ గోడోట్ : శామ్యూల్ బెకెట్); శ్వేతవలయం (ది చాషేషియన్ చాక్ సర్కిల్ : బెర్టోల్ట్ బ్రెఫ్ట్) వంటి అనుసృజనలు ఉన్నాయి.

మొదలి తొలిదశలో వ్రాసిన తొమ్మిది నాటికలను నవనాటికా సంపుటి పేరుతో అమృతోత్సవ సందర్భంగా రసరంజని సంస్థ ప్రచురించింది. మొదలివారి తొలినాటిక అన్వేషణ. ప్రతి మనిషీ ఎదుటి మనిషిలోని మానవత్వాన్ని అంగీకరిస్తే లోకంలో ఇన్న పోట్లాటలూ, అశాంతి ఉండదనే ఇతివృత్తంతో వ్రాసిన నాటిక అన్వేషణ. “ముసలితనంలో ఆనందానికి మంచిమనసు; జ్ఞాపకశక్తి ఉంటే చాలు. ఆనందాన్ని ఆస్వాదించేశక్తి ఉంటే ముసలితనం తప్పక భరించదగ్గదే. అందమైన జీవిత నాటకం. దానిమీద హాయిని గూర్చే వ్యాఖ్య, బడిరోజుల కన్నా యౌవన ప్రారంభంలో తప్పటడుగులకన్నా ఆవేశకరమైన, ఆనందకరమైన జీవన నాటకాన్ని గురించి వ్యాఖ్య. ఇటువంటి నాటకం ఎన్ని కొత్త పాత్రలు ప్రవేశించినా యథాప్రకారం నడిచే నాటకం. దాని ముగింపు ఎప్పటికైనా సుఖాంతమే.” అనే వస్తువుతో వ్రాసిన నాటిక చిన్నలు - పెద్దలు నాటిక. మనోవ్యథ ఒక్కటి లేకుండా ఉంటే మనుషులు హాయిగా ఉంటారు. అదిమాత్రం నిత్యం వాళ్లను మాయనిమచ్చలా అంటిపెట్టుకొని ఉంటుంది. సూదిలా బయలుదేరి దబ్బనంలా తేలుతుంది. చివరకు జీవితాన్ని సమూలంగా నాశన చేస్తుంది. ‘నా’ అనే స్థితినుండి మన స్థాయికి చేరితే ప్రతి మనిషి జీవితంలో వెలుగు; స్వచ్ఛత నెలకొంటుందనే ఇతివృత్తంతో వ్రాసిన నాటిక వీలునామా. వ్యక్తుల కోసం కాదీ సంఘం. సమష్టి జీవితానికి ఏ వ్యక్తి అడ్డం వచ్చినా ఆ వ్యక్తిని దారికి అడ్డు తొలగించాలి. ఆ పురుగును ఏరివేయాలి. అప్పుడే విజయం తథ్యం. ఆ సత్యాన్ని గమనించిననాడు మానవుడు నాగరికతలో మరో అడుగు ముందుకు వేయగలడనే సందేశంతో వ్రాసిన నాటిక రాజదండం.

జీవితం నుండి ఎక్కువ ఫలితాన్ని ఆశించకూడదు. ఆశిస్తే మనలను మనమే దగాచేసుకొన్నట్లే, పరుగెత్తడం మానివేసి నిలబడి ఆలోచిస్తే మనం పోవలసిన పూలతోట కనిపించకమానదనే సందేశంతో వ్రాసిన నాటిక

కల-కాపురం. పవిత్రమైన సరస్వతీ మందిరాల గోడలపై నెత్తుటి చారికలను చిత్రించిన నాటిక సంస్కర్తలు, అడ్డదారిలో నడిస్తే త్వరగా గమ్యం చేరుకోవచ్చు. కానీ ఆ త్రోవనిండా ముళ్ళు, అవాంతరాలూ ఉంటాయి. చక్కటి రాజమార్గంలో వెళితే గమనం; గమ్యం సవ్యంగా ఉంటాయనే వస్తువుతో వ్రాసిన నాటిక అప్పుదారి. ప్రతి మనిషీ ఒక వీరసైనికుడే. ప్రతి ఒక్కడూ దేశమాత పాదాలవద్ద భక్తి వినమ్రతలతో ఉండే పాదరేణువే. దేశమాత రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించాలనే సందేశంతో వ్రాసిన నాటిక జననీ జన్మభూమి.

కల్పితహాస్యం కృత్రిమమైనది. అది కృతకంగా, అసహజంగా ధ్వనిస్తుంది. అప్పటికప్పుడు నవ్వును పుట్టించినా అది క్షణాలలో ఆవిరైపోతుంది. సన్నివేశగతమైన హాస్యం బలీయమైనది. ఉత్తమమైన, ఉన్నతమైన హాస్యానికి అది అసలైన నిర్వచనంలా నిలుస్తుంది. అవకాశం వస్తే పక్కవాళ్ల మీద వాలిపోయి కాఫీనుండి చేబదులు దాకా అవసరాలను గడుపుకొనేవారికి బుద్ధిచెప్పిన ఉదంతంతో ఆద్యంతం పొట్టచెక్కలయ్యే హాస్యరసాన్ని కుమ్మరించిన నాటిక అతిథిదేవోభవ.

అన్వేషణ; చిన్నలు-పెద్దలు; వీలునామా ఆంగ్ల అనుసరణలు. మిగిలినవి స్వతంత్ర రచనలు. కల-కాపురం శ్రవ్యనాటిక. 1955లో ఆకాశవాణి నిర్వహించిన పోటీలలో ఉత్తమ రచన బహుమతి పొందింది. 1955 మే లో ఆకాశవాణి హైదరాబాద్ దాశరథి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో రంగస్థలంపై ప్రదర్శిస్తున్న సమయంలో నేరుగా ప్రసారం చేయబడింది. ఈ నాటికలను గుంటూరు, గుడివాడ, బందరు, నిజాం కళాశాల విద్యార్థులు ప్రదర్శించారు.

"ఇందులో మొదటి మూడూ శైశవావస్థను; తరువాత నాటికలు బాల్యావస్థను చూపుతాయి. నా తొలి అడుగుల తడబాటుతనం ఈ నాటికల్లో స్పష్టంగా కన్పిస్తుంది. అందుకే ఈ నాటికలంటే నాకు బొమ్మ పెట్టిన గోరుముద్దలంత ఇష్టం" అని ముందుమాటలో మొదలివారు నిజాయితీగా పేర్కొన్నారు.

మొదలి నాటకప్రస్థానంలో స్వతంత్రరచనలతోపాటు పాశ్చాత్య, దేశీయ అనువాదాలున్నాయి. కొన్ని నాటకాలను యథామాతృకాలుగా, కొన్నింటిని అనుసృజనగా తెనిగించారు. ఈ అనువాదాలు; అనుసృజనల ఆంతర్యంలో ఒక స్పష్టత గోచరిస్తుంది. పాశ్చాత్య, దేశీయ నాటకాలలో రచనపరంగా; ప్రయోగపరంగా సంచలన విజయాలను సృష్టించిన పలు నాటకాలవిశేషాలను తెలుగు ప్రేక్షకలోకానికి సుపరిచయం చేయడం ఒక భావనగా కన్పిస్తుంది. రెండవకోణంలో ఆయన నాటకఆచార్యులు. దాదాపు పాతికేళ్లపాటు పలు విశ్వవిద్యాలయాల్లో నాటకబోధన చేశారు. పాఠ్యాంశాలలో ఉన్న పాశ్చాత్య, దేశీయ నాటకరంగ తాత్వికభూమికలను బోధించే నేపథ్యంలో ఆయా నాటకశైలులను విద్యార్థులకు సుస్పష్టం చేయడానికి ఆయా నాటకాలను అనువదించడంతోపాటు స్వీయ దర్శకత్వంలో విద్యార్థులచేత ప్రదర్శింప జేశారు. దీనితో విద్యార్థులకు ప్రాచ్య, పాశ్చాత్య నాటకరంగాలు అరటిపండు వలచిపెట్టినంత సరళంగా; సాకల్యంగా అవగతమయ్యాయి. మొదలివారు పాశ్చాత్య; దేశీయ నాటకాల అధ్యయనంలో మహాపండితులు. వారు స్వతహాగా రచయిత; దర్శకులు; అధ్యాపకులు; పరిశోధకులు కావడంతో ప్రదర్శనాయోగ్యమైన అనువాదవిధానం స్పష్టంగా కన్పిస్తుంది. ఆయా ప్రాంతాల కాలానుగుణంగా రచింపబడిన మూలనాటకాలను తెలుగు వాతావరణానికి అనుగుణంగా తీర్చిదిద్దడంతోపాటు రచన; ప్రదర్శనల్లో సంపూర్ణరససిద్ధిని కలిగించడానికి పలు నాటకాల్లో సంప్రదాయ, జానపద కళారీతులను అంతర్భాగంగా చేశారు. దీనితో అనువాదముద్ర తొలిగిపోయి ఇది అచ్చమైన తెలుగు నాటకం అనే భావన ప్రతి ప్రేక్షకునికి కలగడం విశేషం. మొదలివారి స్వతంత్ర, అనువాద, అనుసృజనల్లోని విజయవంతమైన, స్ఫూర్తిదాయకమైన నాటకాల సహృదయ వివేచన ఆవశ్యకం.

**రాజా ఈడిపస్**

గ్రీకు నాటక రచయితల్లో ఉత్తమోత్తముడు సోఫోక్లిస్. వందక పైగా నాటకాలను రచించినట్లు ప్రతీతి. కానీ ఏడు నాటకాలు మాత్రమే లభ్యమౌతున్నాయి. అవి అజక్స్; యాంటిగని; ఈడిపస్; ఫిలాక్టిటస్; ఎలెక్ట్రా; ట్రాకినేయ్; ఈడిపస్ యట్ కొలనస్. ఈడిపస్ నాటకాన్ని క్రీ.పూ. 430-425 మధ్యకాలంలో రచించినట్లు తెలుస్తుంది. క్రీ.పూ. 468లో ఎస్కలస్‌ను ఓడించి ప్రథమ బహుమతిని పొందడంతో నాటక పోటీలలో పాల్గొనడం ప్రారంభించిన సోఫోక్లిస్ 18 పర్యాయాలు డయోనిసెస్ ఉత్సవాలలో ప్రథమ బహుమతిని పొందారు. రాజా ఈడిపస్ నాటకం గ్రీకు నాటకసాహిత్యంలోనే కాదు, పాశ్చాత్య నాటకరంగంలోనే ప్రప్రథమంగా నిలిచే నాటకం. నాటక ఇతివృత్త స్వీకారానికి ఈ నాటకాన్ని ఉత్తమమైన ఉదాహరణగా స్వీకరించాలని అరిస్టాటిల్ పేర్కొన్నారు. రచయితలందరికీ ఈ నాటక ఇతివృత్త నిర్మాణం ఆదర్శం కావాలని ఆయన సూచించారు. “ఆనందం ఎండమావి... సంతోషం శాపం... ఏ మనిషీ ఆనందమయుడు కాదు... జీవితం చివరిక్షణం దాకా.... తుది నిష్క్రమణందాకా” అనే నాటక పతాక సన్నివేశంలోని సందేశమే ఈడిపస్ నాటక కథావస్తువు. దీని ఆంతర్యం జీవితం విధిలిఖితం అనే పురాణసూక్తి. విధి చేతిలో మనిషి కీలుబొమ్మ. దానినుండి తప్పించుకోవడం ఎవరికీ సాధ్యంకాదు.

ఈడిపస్ కథను సోఫోక్లిస్ గ్రీకు పురాణాలనుండి స్వీకరించారు. సుపరిచితమైన గాథను స్వీకరించి దానిని నాటకంగా మలచిన విధానమే ఈ నాటకాన్ని నిత్యనూతనంగా తీర్చిదిద్దింది. ఈడిపస్ కథకన్నా సత్యాన్వేషణ కోసం పడిన తపన; దానికి అవలంబించిన అన్వేషణను నాటక ఇతివృత్తంగా స్వీకరించారు.

ఈ నాటకాన్ని మొదలి అందంగా; అద్భుతంగా; కవితాశైలితో అనువదించారు. మానసిక సంఘర్షణతోపాటు ఉత్సుకతను కలిగించే సన్నివేశాల సమాహార స్వరూపమైన ఈ నాటకాన్ని ప్రదర్శనానుకూలతతో అనువదించారు. మొదలి ఈ నాటక అనువాదంతోపాటు 51 పేజీల సుదీర్ఘమైన పీఠిక; 8 పేజీల అనుబంధంలో గ్రీకు నాటక చరిత్ర; సోఫోక్లిస్ నాటక ప్రాశస్త్యం; ఈడిపస్ నాటక విశేషాలను సోదాహరణంగా పొందుపరిచారు. ఈ విలువైన వివేచన నాటకాభిమానులకు ఎంతో ఉపయుక్తమైనది. ఈ నాటకాన్ని అనువదించిన మొదలి సంప్రదాయ పద్ధతికి భిన్నంగా స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించడానికి మేధోమథనం చేశారు. హైదరాబాద్ కోఠీ ప్రభుత్వ మహిళాకళాశాల ముందుభాగం బ్రిటీష్ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా కట్టడాలు ఉంటాయి. ముందుభాగంలో విశాలమైన మెట్లు; దాని పైభాగంలో విశాలమైన వేదిక; దానికి రెండువైపులా పెద్ద స్తంభాలు ఉన్నాయి. ఆ ప్రదేశాన్ని విశాలమైన వేదికగా చేసుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ మొదటి బ్యాచ్ విద్యార్థుల చేత ప్రదర్శింపచేశారు. ఈ నాటకానికి రంగస్థల దిగ్గజాలైన రాజా రామ్‌దాస్; డాక్టర్ చాట్ల శ్రీరాములు సహాయ దర్శకులుగా వ్యవహరించారు. 1983లో ప్రదర్శించిన ఈ నాటకంలో ఈడిపస్ పాత్రను విద్యాసాగర్; క్రియాన్ పాత్రను తనికెళ్ల భరణి; జొకాస్టా పాత్రను ఉషాజయంతి; కోరస్ పాత్రలను కృష్ణమోహన్; కె. ప్రసాద్; ఆకెళ్ల సత్యనారాయణమూర్తి; వెంకటేశ్వరరావు; పార్థసారథి పోషించారు. ఈ నాటకానికి బెంగుళూరుకు చెందిన రామమూర్తి రంగోద్దీపనాన్ని నిర్వహించారు.

**దొరా! నీ సావు మూడింది**

“దొరా! సింహానివని సింహాసనంమీద కళేబరాన్ని తినే దేగలా మా వళ్లంతా గుచ్చి గుచ్చి తిన్నావ్. బడుగోళ్లనీ, నమ్మినోళ్లనీ, దేవుడని కొలిసినోళ్లనీ సంపుకు తిన్న దొర! ఇయాల్తో నీ సావుమూడింది... ఇది నీకే

కాదు, నీలాంటి నరపశువు లందరికీ హెచ్చరిక" అంటూ పీడిత, తాడిత జనావళి తిరుగులేని ఆధిపత్యాన్నీ, జులుమును ప్రదర్శిస్తున్న దొరతనంపై ఎక్కుపెట్టిన వాడి ములుకు... నీ ఆటకట్టని హెచ్చరిస్తూ పెట్టిన పొలికేక "దొరా నీ సావు మూడింది". యూజినీ ఓనీల్ రచించిన "ఎంపరర్ జోన్స్" నాటకానికి అనుసృజనగా ఆచార్య మొదలి ఈ నాటకాన్ని రచించారు. తరతరాలుగా పెత్తనం చేస్తున్న దౌర్జన్యాన్ని, నరనరాన అహంకారాన్ని జీర్ణించుకొన్న చక్రవర్తి అనే రాజును ప్రజలు ఒక్కుమ్మడిగా ఏకమై తుదముట్టించిన ఉదంతమే ఈ నాటక ఇతివృత్తం. అభివ్యక్తీకరణ ధోరణిలో వ్రాయబడిన ఈ నాటకంలో మొదలి తెలుగునాట సుప్రతిష్ఠమైన జానపద కళారూపాలను అంతర్భాగంగా చేయడంతో, ఇది తెలుగువారి కథ అన్నంత సహజత్వం వచ్చింది. ఈ నాటకంలో మొదలి శారద కథ; వీరవిద్యావంతులు; ఒగ్గు కథలను సన్నివేశానుగుణంగా ప్రయోగించారు. ఈ నాటకానికి మొదలి దర్శకులుగా కూడా వ్యవహరించారు. ఈ నాటకాన్ని మొదట మొదలి నాగభూషణశర్మ దర్శకత్వంలో నరజాతి చరిత్ర సమస్తం అనే పేరుతో ఉస్మానియా థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అమరేంద్ర; ఫ్రాన్సిస్, నవీనలక్ష్మి, సేనాపతి మోహన్ తదితరులు నటించారు. అనంతరం ఇదే నాటకాన్ని దొరా! నీ సావు మూడింది పేరుతో అమరేంద్ర స్వీయదర్శకత్వంలో ప్రదర్శించారు. అనంతరం రసరంజని సంస్థ ఆధ్వర్యంలో ఇదే నాటకాన్ని ఢిల్లీలో జరిగిన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా నాటకోత్సవాలలో సేనాపతి మోహన్ దర్శకత్వంలో అనగనగా ఒకరోజు అనే పేరుతో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో మోహన్; బి.యం.రెడ్డి తదితరులు నటించారు.

**అంధయుగం**

"ఎక్కడో ఒకచోట నిముషనిముషానికీ మరణిస్తూ ఉన్నాడు ప్రభువు. ప్రతి నాట... ప్రతిచోటా వ్యాపిస్తూ ఉన్నది అంధయుగము; యుగప్రవృత్తి. సిగ్గుపడే ఆ పరాజయం సంశయాల ఆ గుడ్డితనం మన మనసుల నిపుడూ ఎపుడూ వెంటాడుతూనే ఉంటాయి. ఒక్క మాటమట్టుకు నిజము. బీజ రూపమ్మయిన మనసున దాగి ఉన్నది ఒక్క సత్యం. సాహసంలో స్వతంత్రంలో కొత్తసృష్టిని కోరడంలో నిరాపేక్షత దాని తత్వం. దాని సత్యం అదే అయినా మనిషి జీవన గమనమందున బాధ్యత మర్యాదకూడిన మనసు చూపే స్వేచ్ఛ ఒక్కటే. అర్థసత్యం బారినుంచి, ఓటమి దాస్యాలనుంచీ మానవ భవితవ్యాన్నెప్పుడూ రక్షిస్తూ ఉంటుంది" అనే సందేశంతో డాక్టర్ ధర్మవీర్ భారతి హిందీలో రచించిన "అంధయుగ్" నాటకానికి మొదలి అనుసరణ అంధయుగం. కురుక్షేత్ర సంగ్రామ తుదిదశలో మహాభారత కథను ఇతివృత్తంగా వ్రాసిన 'అంధాయుగ్' నాటకం భారతీయ భాషా నాటక చరిత్రలో ఒక సంచలనం సృష్టించింది. ఈ నాటకాన్ని రామ్‌గోపాల్ బజాజ్ దర్శకత్వంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ నాటక విభాగం విద్యార్థులు ప్రదర్శించారు. బజాజ్ హిందీ అంధాయుగ్‌కు కూడా దర్శకులు కావడం విశేషం. ఈ నాటకాన్ని బజాజ్ ఆకృత రంగస్థల (థియేటర్ – ఇన్ – రౌండ్) శైలిలోనే ప్రదర్శించారు. మొదలి ఈ నాటక అనుసరణలో కవితాత్మక శైలిని చూపారు. మొదలివారి అర్ధాంగి సరస్వతి ఈ నాటకానికి సహఅనువాదకురాలిగా వ్యవహరించారు.

**కాయితం పులి**

ఎక్కడ దుర్మార్గం శిక్షించబడి మంచి నిలబడుతుందో అదే రామరాజ్యం. "సమష్టిగా నిలబడండి. అన్యాయాన్ని, రాక్షసత్వాన్ని నిర్భయంగా ఎదిరించండి. గుండెబలం నీది, శ్రమించే కండబలం నీది. కండకావరం; కార్పణ్యం నిను కాలరాసి నలిపేసేటప్పుడు బిగించిన పిడికిలి విప్పావెందుకు. శ్రమశక్తీ, నీ యుక్తి చివరికవే రక్ష. శ్రామికజన

స్వయంరక్ష కదే బాలశిక్ష" అంటూ బాధాసర్పదష్టులలో చైతన్యం నూరిపోసి అన్యాయాలు, అక్రమాలు ఇంకానా ఇకపై సాగవనే సందేశంతో శంకర్ శేష్ హిందీలో వ్రాసిన పోష్టర్ నాటకానికి అనుసృజనగా మొదలి తన శ్రీమతి సరస్వతితో కలిసి 'కాయితం పులి'ని రచించారు. కాయితం పులి గిరిజన, బడుగు, బలహీన వర్గాలమీద జరిగే అత్యాచారాలకు అద్దం పట్టింది. ఇది సంపూర్ణ నాటకం (టోటల్ థియేటర్) శైలిలో ప్రదర్శింపబడింది. బడుగుజీవుల జీవనవిధానాలు మెరుగుపరచడానికి వారి సమస్యలపట్ల అవగాహన కలిగించడమే సరైన మార్గమని నాటక ఇతివృత్తం సూచిస్తుంది. ఆట, పాట; మూకాభినయం; ఆంగిక భాష ఇందులో ప్రాధాన్యం వహించాయి. హాస్యానికి వీర భయానక రసాలను జోడించి ఆధునిక జీవన సత్యాలకు ఈ నాటకం అద్దంపట్టింది. మొదలి దర్శకత్వంలో హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ నాటకవిభాగం విద్యార్థులు ప్రదర్శించారు.

**మన్మథుడు మళ్లీ పుట్టాడు**

"మన్మథుడు మన మనస్సుల్లో ఎప్పుడూ ఉంటాడు. మన ఆత్మసౌందర్యానికి అద్దం పడుతూ కావాలను కున్నప్పుడు కావాలనుకొన్న వాళ్లకు ప్రత్యక్షం అవుతూనే ఉంటాడు. మన్మథుడంటే బాహ్యసౌందర్యం మాటున దాగి ఉన్న మానసిక సౌందర్యం, మన్మథుడు మళ్లీ మళ్లీ పుడుతూ ఉంటాడు. మనకోసం – మనుషుల కోసం" అనే వస్తువుతో ఆచార్య మొదలి రచించిన నాటకం 'మన్మథుడు మళ్లీ పుట్టాడు'. బాహ్యసౌందర్యమే సర్వస్వం అనుకొంటున్న ఈ కాలంలో అసలు సౌందర్యం అంటే ఏమిటి అనే ప్రశ్న ఉదయించడమే ఒక సవాలు. ఈ ప్రశ్నకు సమాధానంగా ఆదర్శాలను పేర్కొనడం నేలవిడిచి సాముచేయడమే కావచ్చు. కానీ ఆదర్శాల సాధనలోనే మనిషి ఆశించిన గమ్యాలు చేరుకోగలుగుతాడు. మనిషి సౌందర్యం అంతర్నిహితం. ఆయా వ్యక్తులు తాము చేసే పనుల్లో తన్మయులైనప్పుడు వారి మనసులు ఉత్తేజం పొందుతాయి. ఆ ఉత్తేజం వల్ల ఒక వర్చస్సు జ్వలిస్తుంది. దానినే సౌందర్యం అంటాం. చాలామంది ఈ సౌందర్యాన్ని చూడలేరు. అందుకోనూలేరు. మనచుట్టూ మనలోనే ఉన్న ఈ అందాన్ని చూడడానికి మనకు, మనసులకు కొత్త దృక్పథం కావాలి. ఈ దృక్పథాన్ని కలగజేయడానికి వీలైన ఆలోచనను రేకెత్తించడమే ఈ నాటక లక్ష్యం అని రచయిత మొదలి పీఠికలో స్పష్టంగా పేర్కొన్నారు.

ఈ నాటకంలో ఫాంటసీ ఉంది. అభూతకల్పన ఉంది. నువ్వెంత అందంగా ఉన్నావంటే టెలిఫోన్ మోగుతుంది. ఫ్యాన్ గిర్రున తిరుగుతుంది. కాటికి కాళ్లు చాపుకొన్న 80 ఏళ్ల ముసలాడు కూడా ఇరవై ఏళ్ల కుర్రవాడిగా మారిపోతాడు. ఆ భావనలో ఈదులాడుతూ ఉంటాడు. మంచివాడిలోనూ, చెడ్డవాడిలోనూ కలిగే భావాలను దృశ్యంలో బంధించడానికి ఫాంటసీ దోహదం చేస్తుంది. ఈ నాటకానికి ఆపోలో ఆఫ్ బెల్లాక్ అనే ఫ్రెంచ్ నాటకం ప్రేరణ. ఈ నాటకానికి చాట్ల శ్రీరాములు దర్శకులుగా వ్యవహరించారు. ఈ నాటకాన్ని రంగస్థలంపై ప్రదర్శించడంతోపాటు రేడియోలో శ్రవ్య నాటకంగా, దూరదర్శన్‌లో దృశ్యరూపంగా ప్రసారం చేయబడింది.

**ప్రజానాయకుడు ప్రకాశం**

రాక్షసంగా జనానికి కీడు చేసే యంత్రాంగం రాజకీయం అన్నారు పరుచూరి సోదరులు. రావణుడు; జరాసంధుడు; కీచకుడు; యముడు నలుగురు కలిసిన స్వరూపం రాజకీయం. ప్రజలకు సేవ చేయడానికి పదవి సాధనం నాడు. కోట్లు దండుకోవడానికి పదవి సోపానం నేడు. ఉన్నదంతా అర్పించారు ఆనాడు. మోయలేనంతగా ఆర్జిస్తున్నారు ఈనాడు. గుండుకెదురుగా గుండె నిలిపిన త్యాగధనులు అప్పుడుంటే ఆస్తులను కాపాడుకోవడానికి తుపాకీ గుళ్లతో గుండెలను చీలుస్తున్న నాయకులు ఇప్పుడున్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు

పేరు వింటే రోమాంచితం కలుగుతుంది. రెండు చేతులతో ఆర్జించే సొమ్ము; పెద్దకుటుంబం అన్నింటినీ దేశం కోసం తృణప్రాయంగా అర్పించిన త్యాగధనుడు ప్రకాశంపంతులు. కుటిలరాజకీయ విషపుకోరలలో చిక్కి పదవిని కోల్పోయిన నిష్కళంక రాజనీతిధురంధరుడు ప్రకాశం. నమ్మిన సిద్ధాంతంకోసం కొండనైనా ఢీకొనే ధీశాలి ఆయన. తెలుగువాడి ఆత్మవిశ్వాసం; ఆత్మాభిమానం అనే మాటకు అసలైన నిర్వచనం ప్రకాశం. ఆ మహనీయుని జీవిత చరిత్రను కళ్లకు కట్టేలా నాగభూషణశర్మ రచించిన నాటకం ప్రజానాయకుడు ప్రకాశం. ప్రకాశంపంతులు ఆత్మకథ "నా జీవితయాత్ర"ను ఆధారం చేసుకొని చారిత్రక సంఘటనలు; పాత్రలకు కొంత నాటకీయతను జోడించి మొదలి ఈ నాటకాన్ని రచించారు.

ఈ నాటకరచనకు స్ఫూర్తిని మొదలి ఈవిధంగా పేర్కొన్నారు. "తెలుగు వాళ్లు జాతీయస్థాయిలో ఏ ఒక్క రంగంలోనూ నాయకత్వాన్ని సాధించలేకపోవడానికి గల కారణాలు ప్రకాశం సుదీర్ఘ రాజకీయ జీవితంలో అంతస్సూత్రంగా ఉన్నాయనిపిస్తుంది. ఆ కారణాలను విశ్లేషించుకొని ఆ పరిస్థితులను అధిగమించి అత్యుత్తమ స్థాయిలో గుర్తింపు పొందగల అవకాశాలను సృష్టించుకోవడం ఇప్పటికైనా అవసరం అంటూ తెలుగువారికి సమర్పించుకొనే వినతిపత్రం ఈ నాటకం."

ఈ నాటకాన్ని డాక్యుమెంటరీ నాటకంగా కొందరు భావించారు. దీనిపై మొదలివారు ముందుమాటలో ఈవిధంగా వివరణ ఇచ్చారు. "ఇది డాక్యుమెంటరీ డ్రామా కాదు. చారిత్రక నాటకం. డాక్యుమెంటరీ డ్రామాలో సంఘటనలను యథాతథంగా చిత్రీకరిస్తాం. పాత్రల ప్రతి చర్యా మనకు అవగతమై ఆ పాత్రల అస్తిత్వం మన అనుభవాలకు లోబడి ఉండాలి. చారిత్రక నాటకంలో పాత్రల సంఘటనల మూలాలు చరిత్రనుండి గ్రహించినవే. కానీ చారిత్రకత చెడిపోకుండా అది ఇనుమడించేలా ఆ సన్నివేశాల రూపకల్పన చేయడం చారిత్రక నాటకావసరం. చారిత్రక నాటకంలో ఆయా వ్యక్తుల మనస్తత్వాలను ఆయా సంఘర్షణలు రూపుగడుతున్నాయా లేదా అన్న విచక్షణ ముఖ్యం. ఆ నియమిత నేపథ్యంలో ఇలాగే జరిగి ఉండాలి అని ప్రతి సన్నివేశాన్ని గురించి ప్రేక్షకులు అనుకోవాలి. ఈ చారిత్రక స్పృహను చారిత్రకత (Historicity) ను ప్రతిబింబించే విధంగా వ్రాసిన ఎపిక్ ప్లే (కావ్యనాటకం) ఇది. ఎపిక్ ప్లేలో అంతర్లీనంగా ఉండే లక్షణాలు ఇందులో చాలా ఉన్నాయి. నాటకం సంఘటనాత్మకం. అంతస్సూత్రంగా ఉండే వ్యక్తి చరిత్రను క్రమానుసారంగా ప్రతి సన్నివేశంలోనూ చిత్రించడం (ఎపిసోడ్) దీనికి మూల లక్షణం. ఆ సంఘటనలమీద రచయిత వ్యాఖ్యానాన్ని కథనంగా చెప్పడం, తద్వారా చారిత్రక పరిణామాలను దృశ్యమానం చేస్తూనే ఆధునిక జీవితం మీద అవగాహన కలగజేయడం, చరిత్రను వ్యాఖ్యానిస్తూ ప్రేక్షకుల దృష్టిని మౌలిక జీవన సత్యాల వైపుకు మళ్లించడం వంటి అంశాలను అవసరమైనంత మేరకు ఈ నాటకంలో వాడుకోవడం జరిగింది. కథనం; పాటలు, ప్రొజెక్షన్స్ వంటివి కేవలం కథను సుగమం చేయడానికే కాక సన్నివేశాల మీద వ్యాఖ్యలు చేయడానికి కూడా ఉపయోగించడం జరిగింది. అందువల్ల నాటకంలోని సంఘటనలు ఎంత ముఖ్యమైనవో కథనం కూడా అంత ముఖ్యమైనది."

ఈ నాటకానికి మొదలి దర్శకులు. ప్రకాశంపంతులు పాత్రను డాక్టర్ చాట్ల శ్రీరాములు; ప్రకాశం తల్లి సుబ్బమ్మ పాత్రను బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి; ఇమ్మానేని పాత్రను దుగ్గిరాల సోమేశ్వరరావుతో పాటు 45మంది కళాకారులు వివిధ పాత్రలను పోషించారు. ఈ నాటకాన్ని 1999 నుండి రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో 25 ప్రదర్శన లిచ్చారు. హైదరాబాద్ దూరదర్శన్ దీనిని టెలిఫిల్మ్‌గా చిత్రించి పలుపర్యాయాలు ప్రసారం చేసింది.

**హయవదన**

భారతీయ నాటక రంగంలో డాక్టర్ గిరీష్ కర్నాడ్ రచించిన హయవదన నాటకానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఒక జానపద కథను ఆధారంగా చేసుకొని కర్నాడ్ ఈ నాటకాన్ని మొదట కన్నడంలో రచించారు. తదుపరి ఆంగ్లంలోకి అనువదించబడింది. ఆంగ్లనాటకానికి మొదలి దర్శకులుగా వ్యవహరించారు. ఆ నాటక ప్రయోగ మాధుర్యాన్ని తెలుగు ప్రేక్షకలోకానికి అందించడానికి మొదలి అదే పేరుతో అనువదించారు. ఈ నాటకంలో కత్తియుద్ధ విన్యాసాలను ఆసక్తికరంగా మొదలి తీర్చిదిద్దారు. రంగోద్దీపనంలో ఈ నాటక ప్రదర్శన కొత్తపుంతలు తొక్కింది. మొదలి దర్శకత్వంలో అనామిక సంస్థ విస్తృతంగా ప్రదర్శించింది. డాక్టర్ జి.యస్. ప్రసాదరెడ్డి; శేఖర్ ఈ నాటకంలో పోటీపడి నటించారు.

**మదనకామరాజు కథ**

పెళ్లి జరిగిన కొద్ది నెలలవరకూ భార్యతో మమేకమైపోయే మగాడు కాలం గడిచేకొద్దీ చిరుతిళ్లకు పాకులాడతాడు. తెలిసినా భార్య ఓర్పుతో ఉంటుంది. పక్కచూపులు, తొంగిచూడడాలూ; ప్రేమ కలాపాలు : బెడిసికొడితే జారుకోవడాలు వంటి మగధీరుల శృంగార జీవితంలో తరచుగా జరుగుతూ ఉంటాయి. ఈ వస్తువుతో కడుపుబ్బ నవ్వించే హాస్యసన్నివేశాలతో మొదలి రచించిన హాస్యనాటకం మదనకామరాజు కథ.


చీటికీమాటికీ పోట్లాడుకొనే తల్లిదండ్రుల ప్రవర్తన పిల్లల్లో విషబీజాలను నాటుతుంది. తాము చూసిన ప్రతి భార్యా, భర్తా ఇలాగే ఉంటే వివాహ వ్యవస్థమీద భయం, చిన్నచూపు ఏర్పడుతుంది. పిల్లలకు జీవితంమీద అవగాహన కలిగించడం తల్లిదండ్రుల బాధ్యత అనే సందేశంతో మొదలి వ్రాసిన హాస్య నాటిక "పెళ్లికి పదినిముషాల ముందు". ఈ నాటకం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి పలు పర్యాయాలు ప్రసారం చేయబడింది.

మొదలి రచించిన జననీ జన్మభూమి నాటిక వరంగల్‌లో జరిగిన కాకతీయ ఉత్సవాలలో ఉత్తమరచన బహుమతి పొందింది. ప్రజానాయకుడు ప్రకాశం నాటకానికి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ ప్రతిభామూర్తి పురస్కారాన్ని ప్రదానం చేసింది. 2010లో రసరంజని సంస్థ మూడురోజులు ఆచార్య మొదలి రచించిన నాటకాలు, నాటికలతో నాటకోత్సవాలను నిర్వహించింది.

మొదలి ఒక నాటక జ్ఞానపీఠం. నాటకదర్శిని. మొదలివారిలో ఉన్న రచన, దర్శకత్వం, అధ్యాపన, పరిశోధన ఒకదానితో ఒకటి పోటీపడ్డాయి. ఏది విజేతో తేల్చుకోలేక అందరం సమానమే అని సమాధానపడ్డాయి. నాటకంమీద వారు చేసిన పరిశోధన అద్భుతమైనది. ఎన్నో నాటక కార్యశాలలు; సదస్సులు; ఉత్సవాలకు ఆయన పురుడు పోశారు. నేతృత్వం; కర్తృత్వం వహించారు. నాటక సోమయాజిగా సుస్థిరంగా నిలిచారు. నూరేళ్లలో కన్యాశుల్కంపై వెలువడిన 182 అరుదైన వ్యాసాలను సేకరించి విశాలాంధ్ర ముద్రించిన 1000 పేజీల సంపుటికి సంపాదకులుగా వ్యవహరించారు. సురభి నాటక చరిత్రను గ్రంథస్థం చేసి నాటకరంగానికి మహోపకారం చేశారు. తెలుగునాటక ఆరంభ దశలో ఒక వెలుగు వెలిగిన అలనాటి నటుల గాత్రమాధుర్యాన్ని విలువైన సంపదగా వర్తమానానికి కానుకగా ఇచ్చారు. ప్రాచ్య, పాశ్చాత్య నాటక రంగాలకు చెందిన 35 వేల పేజీల సమాచారాన్ని భద్రపరిచారు. ఆయన ఒక నాటక గ్రంథాలయం. ఆయనే ఒక నాటక విశ్వవిద్యాలయం. అవిశ్రాంత నాటక కళాసేవకుడు. అందుకే తెలుగు నాటకమే ఆయనకు ఎంతో... ఎంతో ఋణపడి ఉంది.



మొదలి, బి.వి. కారంత్, రాజా రామదాస్



మొదలి, పి.యస్.ఆర్. అప్పారావు, ఆత్రేయ